క్లుప్తంగా

హనుమత్ జయంత్యుత్సవాలు



పాత గుంటూరు: పాత గుంటూరులోని విశాఖ శారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హనుమత్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రభాత సేవ, ఆలయ ప్రదక్షిణలు, ఆకు పూజలు, తీర్థ గోష్ఠి, ప్రసాద వినియోగం జరిగింది. వీరాంజనేయ స్వామికి 108 కలశాలతో మహాస్నపన అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షులు కొప్పు రావూరి బాబురావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రంధి కోటేశ్వరరావు, ఆత్మకూరి లక్ష్మణ రావు, చీమకుర్తి తాండవ నాగ మల్లేశ్వరరావు, కాసుల వెంకట శివ ప్రసాద్, నాగం రామారావు పాల్గొన్నారు.

అనూషకు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మాసూటికల్ సైన్సెస్ పరిశోధకురాలు నూతక్కి అనూషకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. ఫార్మసీ పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ పి.రవి పర్యవేక్షణలో 'ఫైటోకెమికల్ స్క్రీనింగ్ అండ్ బయలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ డిఫరెంట్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఆఫ్ అండ్రోగ్రాఫిస్ ఎకియాడ్స్, కొమ్మికార్పస్ చైనైసిస్ అండ్ టాలినమ్ పోర్చులేసిఫోలియం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని వివరించారు.

కుట్టు మిషన్లు పంపిణీ



గుంటూరు మెడికల్: సుష్మగౌడ్ 24వ జయంతి సందర్భంగా స్థానిక పట్నంబజారులోని సుష్మగౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన బుధవారం ముగ్గురు పేద వితంతువులకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సహాయంతో ఆర్థికంగా అభివృద్ధిచెందాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జల్లెడ ఓంకారం, ప్రధాన కార్యదర్శి జల్లెడ సుష్మ రావు గౌడ్, ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివప్రసాద్ గౌడ్, కోశాధికారి జల్లెడ జయ సుస్మితా రావు గౌడ్, సహా కార్యదర్శి హరిత గౌడ్, చిలకా తన్మయ పట్నాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ మెగా ఈవెంట్



నగరంపాలెం: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు రోజులపాటు జరగనున్న మెగా ఈవెంట్‌ను బుధవారం ఇంపాక్ట్ ఫౌండర్ జి.నాగేశ్వరరావు, మాస్టర్ మైండ్స్ అధినేత మట్టుపల్లి మోహన్ ప్రారంభించారు. భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు హాజరై తమ వాస్తవిక జీవిత అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో సివిల్ ట్రైనర్ బాలలత, ఎల్.వేణుగోపాల్, కల్యాణ్, పాదరామ్, సుధీర్ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవెంట్ ఇన్‌చార్జ్ చల్లా రవి, కె.వెంకట్, వీరాంజనేయులు, కోర్ కమిటీ సభ్యులు కె.కృష్ణమూర్తి, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

జీఎస్టీ అధికారుల పేరుతో మోసం


గుంటూరుఈస్ట్: జీఎస్టీ అధికారులమంటూ గుర్తు తెలియని వ్యక్తులు షాపు యజమాని నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బ్రాడీపేట 6/14లో షేక్ ఖాజా గేమ్‌వరల్డ్ ఎల్రక్టానిక్‌షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఇద్దరు దుకాణానికి వచ్చి జీఎస్టీ అధికారులమని చెప్పారు. జీఎస్టీ చెల్లించాలని బెదిరించారు. రూ. 1,700 నగదు, బ్లూటూత్ తీసుకెళ్లారు. బాధితుడికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

గుంటూరు ఈస్ట్: భవనంపై పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్ కిందపడి గాయపడిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నాయుడుపేటకు చెందిన పి.శ్రీను ఎస్‌వీఎన్‌కాలనీలో ఓ భవనం రెండో అంతస్తులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఇనుప చువ్వ శ్రీను వీపులోకి గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. భవన యజమాని నగరంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీను చికిత్స పొందుతున్నాడు.

కృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

- ప్రజల కోసం పనిచేసిన మంచి వ్యక్తి తనబుద్ధు
- కృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ సభలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



తనుబుద్ధి కృష్ణారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ, మేయర్ మనోహర్, మాజీ ఎంపీ మోదుగుల, కృష్ణారెడ్డి కుటుంబసభ్యులు

గుంటూరు రూరల్: మంచి మనసున్న నాయకుడు నీతినిజాయితీలకు మారుపేరు తనబుద్దు కృష్ణారెడ్డి అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి కొనియాడారు. బుధవారం 48వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డులో దివంగత నాయకుడు, డివిజన్ కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డితో కలిసి అయోధ్యరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కృష్ణారెడ్డి ఎంతో నిజాయితీగా ప్రజా సమస్యల పరిష్కారానికి, రెడ్డిపాలెం అభివృద్ధికి కృషిచేశారన్నారు. కృష్ణారెడ్డి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎల్లపుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి కృష్ణారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికీ తలలో నాలుకలా ఉండే కృష్ణారెడ్డి అకాల మృతి డివిజన్‌కు, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ కుటుంబం ఎల్లపుడూ అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం అండగా ఉంటారని చెప్పారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ కృష్ణారెడ్డి జయంతి సందర్భంగా డివిజన్ పరిధిలోని ఇన్నర్‌రింగ్ రోడ్డు, సరస్వతి నగర్‌లలో అభిమానులు ఆయన విగ్రహాలతోపాటు, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఆవిష్కరించటం హర్షణీయమన్నారు. వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రజల కోసం పోరాడిన మంచి నాయకుడు కృష్ణారెడ్డి అని కొనియాడారు. అనంతరం విగ్రహావిష్కరణలు చేశారు. కృష్ణారెడ్డి జయంతి సందర్భంగా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీడబ్ల్యూసీ సభ్యుడు తాడిశెట్టి మురళి, నగర డిప్యూటీ మేయర్ షేక్ సజిల, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న తాడిశెట్టి మురళీమోహన్

కృష్ణారెడ్డి విగ్రహానికి నివాళులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్పొరేటర్ తనుబుద్దు కృష్ణారెడ్డి హఠాన్మరణం పార్టీకి తీరని లోటని పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు, టీటీడీ ప్రత్యేక ఆహ్వానితులు తాడిశెట్టి మురళీమోహన్ అన్నారు. ఈమేరకు గుంటూరు రూరల్ రెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తనుబుద్దు కృష్ణారెడ్డి విగ్రహానికి బుధవారం మురళీమోహన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడుతూ కృష్ణారెడ్డితో దశాబ్దాలుగా ఎంతో సాన్నిహిత్యం ఉందన్నారు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పాటు పడిన గొప్ప వ్యక్తి కృష్ణారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ



మహా యజ్ఞం పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముస్తఫా

పాత గుంటూరు: ప్రజల శ్రేయస్సు కోసం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు వరకు జరిగే అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో గుంటూరు ప్రజలందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే షేక్. మహమ్మద్ ముస్తఫా చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం నాజ్ సెంటర్ కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో మహా యజ్ఞానికి సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాను సారం దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించే మహాయజ్ఞంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.శ్రీనివాసరావు, చైర్మన్ పి.జయ ప్రకాష్ రెడ్డి ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకట రత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు అనిల్ కుమార్, నాగేశ్వర రావు, వెంకట రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మానసిక వైద్యుల సేవలు ప్రశంసనీయం

సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి



రోగిని పరామర్శిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి, పక్కన కట్టా కాళిదాసు, వైద్యులు

గుంటూరు మెడికల్: మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలు అందించాలన్న దృక్పథంతో వైద్యులు ఈ విభాగాన్ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా బుధవారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగాన్ని ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆ విభాగం వైద్యులతో సమీక్షించారు. మానసిక వ్యాధిగ్రస్తులతో మాట్లాడినప్పుడు వైద్య సేవలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. మానసిక సమస్యలకు వైద్యులు వైద్య సేవలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్య వృత్తిలో డబ్బులు సంపాదించాలన్న ఆలోచన ఎక్కువైందని వివరించారు. మానసిక వైద్య విభాగాన్ని వైద్యులు ఎంపిక చేసుకోవడం చాలా అరుదుగా కనిపిస్తోందన్నారు. మహిళా వైద్యులు కూడా ఈ విభాగాన్ని ఎంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు న్యాయ పరమైన సమస్యలు ఉంటే ఆస్పత్రిలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్, మాజీ అదనపు పిపి కట్టా కాళిదాసు, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ నిమిషా, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. అమరావతిరోడ్డు జ్వరాల ఆస్పత్రి వద్ద సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతుని శరీరం వద్ద రక్తపు మరకలు కనిపించటంతో అనుమానంతో క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఈ వ్యక్తి గత రెండు రోజుల క్రితం ఆస్పత్రికి వచ్చి ఒళ్ళు నొప్పులుగా ఉన్నాయని హిందీలో మాట్లాడాడని, దీంతో వైద్యులు చికిత్స చేసి 108లో జీజీహెచ్‌కు రిఫర్ చేశారని తెలిసింది. 108 వచ్చి ఆతనిని జీజీహెచ్‌కు తీసుకువెళ్ళేందుకు యత్నించినా ఆ వ్యక్తి వారికి సహకరించకపోవటంతో వెళ్లిపోయినట్టు సమాచారం. రెండురోజులుగా ఆస్పత్రి చుట్టుపక్కల తిరుగుతూ ఉన్నాడని, మంగళవారం ఆసుపత్రి వద్ద అంబులెన్స్ వెనుక మృతి చెందిపడిఉన్నాడని తెలిసింది. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెల్లడించారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్యాయత్నం



గుంటూరు రూరల్: ఇంట్లో పనులు సక్రమంగా చేయటం లేదని తల్లి మందలించటంతో కుమార్తె ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం నగరాలులోని హిమని నగర్‌లో విన్నకోట సుదర్శనరావు, ఆయన భార్య కళ్యాణి, కూతరు నిహారిక లక్ష్మి నివసిస్తుంటారు. రెండు రోజులుగా ఇంట్లో పనులు సక్రమంగా చేయటంలేదని తల్లి కుమార్తెను బుధవారం ఉదయం మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన కుమార్తె ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

• అభినందన



గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుగా, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వై షేక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ విభాగం ఆధ్వర్యంలో 70 మందికిపైగా వైద్యులను డాక్టర్ వై షేక్ పార్టీలో చేర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలోని తన కార్యాలయంలో డాక్టర్ వై షేక్‌ను శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మెరుగైన సేవలందించాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

– గుంటూరు మెడికల్

• జయ 'జైన్' ధ్వానాలు





విద్యానగర్ 3వ లైన్‌లో కొత్తగా నిర్మించిన జైన్ గుడి ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలోభాగంగా బుధవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో జైన్ సంప్రదాయం ప్రకారం.. విశేష కార్యక్రమాలు నిర్వహించారు. జైన్ గురు మణి ప్రభ్ సూరీజి గురువారం ఉదయం జరిగే గుడి ప్రతిష్ఠ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సుక్కిరాజ హుండియా, అశోక్ హుండియా, మహేంద్ర గులేచా, జుగ్రాజ్ భండారి, జైన్‌లు పాల్గొన్నారు. జైనుల జయజయధ్వానాలతో ఆ ప్రాంతం మార్మోగింది. – పాత గుంటూరు

పత్తిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై సమీక్ష



స్టాళ్లను పరిశీలిస్తున్న ఏపీ పరిశ్రమలు, చేనేత వస్త్రాల విభాగం ప్రధాన కార్యదర్శి సునీత తదితరులు

గుంటూరు రూరల్: పత్తిపంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడులు, రానున్న పంట కాలంలో చేపట్టే ప్రణాళికలు సిద్ధం చేసేందుకు సమీక్ష సమావేశం, ప్రదర్శనను లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో అధికారులు బుధవారం నిర్వహించారు. పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి సమీక్షకు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో భారీస్థాయిలో పత్తి ప్రదర్శన క్షేత్రాలను నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, చేనేత వస్త్రాల విభాగం ప్రధాన కార్యదర్శి కె.సునీత ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పత్తి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సుధారాణి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, ఏడీఆర్ డాక్టర్ జీఎమ్‌వీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సరస్వతి

గుంటూరు రూరల్: చోరీలు చేసే అలవాటు ఉందని యజమాని పనిలోంచి తీసేయడంతో మనస్థాపానికి గురైన మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యరగాని సరస్వతి, ఆమె భర్త రామకృష్ణ నగరంలోని మిర్చియార్డు వద్ద నున్న ఎమ్ఎస్ఆర్ మిర్చి కమీషన్ కొట్టు, శ్రీ రామ చిల్లీస్‌లో కాపలా పనికి కుదిరారు. రెండు నెలల క్రితం ఆ దుకాణం ముందు నిలిపిన ఒక ద్విచక్రవాహనంలో రూ.4.70 లక్షలు అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా చోరీ చేసింది రామకృష్ణే అని తేలింది. దీంతో అతని వద్దనుంచి నగదును రికవరీ చేశారు. అనంతరం రామకృష్ణను పని నుంచి యజమాని తీసివేశారు. నగదు రికవరీ అనంతరం రామకృష్ణ యజమాని వద్దకు వచ్చి చేసిన తప్పు ఒప్పుకుని కేసును కోర్టులో కొట్టేయించాలని రాజీ కోరారు. దీంతో యజమాని రాజీపడి లోక్‌అదాలత్ ద్వారా చోరీ కేసును కొట్టివేయించారు. తమ కాపలా పని తమకు మళ్లీ ఇప్పించాలని రామకృష్ణ, అతని భార్య సరస్వతి యజమానిని కోరారు. దీనికి యజమాని నిరాకరించడంతో మనస్థాపానికి గురైన సరస్వతి పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు బాధితురాలి పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరహరి తెలిపారు.

కులం పేరుతో దూషణపై కేసు

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో ఓ వ్యక్తిని దూషించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీపురానికి చెందిన రాకేష్ రోషన్, మారుతీనగర్‌కు చెందిన మనోజ్ఞ అనే మహిళ వద్ద మూడేళ్ల క్రితం రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించడం లేదు. మనోజ్ఞ ఈ విషయమై రోషన్‌పై ఒత్తిడి చేసింది. మనోజ్ఞతోపాటు ఆమె తల్లి రాధ కలిసి రోషన్‌తోపాటు, అతని భార్యను కులం పేరుతో దూషించారు. ఈ విషయంపై బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: ఆస్తి వివాదం నేపథ్యంలో నలుగురు వ్యక్తులు వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏటీఅగ్రహారం రెండో లైనులో నివశించే షేక్ ఇబ్రహీంకు తన తల్లి నుంచి వచ్చిన రెండు ఇళ్లు ఉన్నాయి. ఇబ్రహీం మేనల్లుడు రియాజ్, లోహిత్‌లు ఆస్తిలో వాటా కావాలంటూ ఇబ్రహీంతో గొడవ పడుతున్నారు. బుధవారం రియాజ్, లోహిత్ మరో ఇద్దరితో వచ్చి ఇబ్రహీంపై దాడి చేసి కత్తితో గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డీ–13 సెక్షన్‌లో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ వివరాలను విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు బుధవారం వెల్లడించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. 4,808 సర్వీసులు తనిఖీచేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 370 మందికి రూ.19.7 లక్షలు అపరాధ రుసుము విధించారు. విద్యుత్ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండాలని, సీలు లేకున్నా.. తుప్పు పట్టి ఊడినా వెంటనే అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలని సూచిచారు. మీటర్లకు సీలు లేకపోతే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. విద్యుత్ చౌర్యం చేస్తూ దొరికితే అపరాధరుసుం విధిస్తామని, రెండోసారి అదేతప్పు చేస్తే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా, వాట్సాప్ ద్వారా చేయవచ్చని వివరించారు. తనిఖీల్లో డీఈఈ ఎం.రవికుమార్, పి.హెచ్.ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, వి.బాజీ పాల్గొన్నారు.

14న శుభాంజలి ఆణిముత్యాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈనెల 14న అందాల నటుడు శోభన్‌బాబు సూపర్‌హిట్స్ పేరున సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్ర 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

సీబీఐ కొత్త పథకం సెంట్ సురక్షిత్- సమృద్ధి

నగరంపాలెం: ఖాతాదారుల సౌకర్యార్థం 'సెంట్ సురక్షిత్- సమృద్ధి పేరుతో సరికొత్త రికరింగ్ డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) రీజినల్ మేనేజర్ శ్రీజయ్‌మండపే తెలిపారు. గుంటూరు రీజినల్ కార్యాలయంలో బుధవారం ఆ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల వయసు, సంపాదనాపరులైన వారు పథకానికి అర్హులని పేర్కొన్నారు. పొదుపు కింద నెలకు కనీసం ఇన్‌స్టాల్‌మెంట్ రూ.10 వేల నుంచి ఒక లక్ష వరకు ఉంటుందని, కాలపరిమితి 84 నెలలు లేదా ఏడేళ్ల వ్యవధి అని, మెచ్యూరిటీ మొత్తం జమ చేసిన అసలు+ వడ్డీ ఉంటుందని పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కవరేజ్ ఇన్‌స్టాల్‌మెంట్‌కు 100 రెట్లు ఉంటుందని, ఇన్సూరెన్స్ ప్రీమియమ్‌ను క్రమ వాయిదాలలో బ్యాంక్ భరిస్తుందని చెప్పారు. ఆరు నెలలు తరువాత ఎప్పుడైనా నగదు ఉపసంహరించుకోవచ్చునని పేర్కొన్నారు. డెత్ క్లాజ్ కింద ఇన్సూరెన్స్ కవరేజ్ + అప్పటి వరకు జమచేసిన ఇన్‌స్టాల్‌మెంట్స్ వడ్డీతో సహా చెల్లించనున్నట్లు వెల్లడించారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

గుంటూరుఈస్ట్: పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇస్తామని ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంపాలెం పరిధిలో నివాసం ఉండే వి.నందినిబాయి ఎంబీఏ చదివి ప్రైవేటు జాబ్ చేస్తున్నారు. అయితే ఆమె వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. టెలిగ్రామ్ గ్రూపులో జాయినైతే పార్ట్‌టైమ్ ఉద్యోగం వస్తుందని మెసేజ్‌లో పేర్కొన్నారు. ఆశపడ్డ నందినిబాయి టెలిగ్రామ్ గ్రూపులో జాయినైంది. జాబ్ కావాలంటే ప్రిపెయిడ్ ట్యాక్స్ కింద డబ్బులు చెల్లించాలని సూచించారు. దీంతో నందినిబాయి రూ.30వేలు, రూ.15 వేలు, రూ.50వేలు మూడు దఫాలుగా చెల్లించారు. అంతటితో సరిపెట్టకుండా మరో రూ.50వేలు చెల్లించాలంటూ మెసేజ్‌లో పంపడంతో మోసపోయినట్టు గుర్తించిన నందిని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్యదర్శులకు బాధ్యత లేదా

ప్రత్తిపాడు: గృహ నిర్మాణాల విషయంలో కార్యదర్శులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి ప్రశ్నించారు. ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డీపీఓ కేశవరెడ్డి జగనన్న గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా పురోగతిపై సమీక్షించారు. యనమదలలో తొమ్మిది గృహాలు శ్లాబ్ వరకు వచ్చి, శ్లాబ్ పూర్తి కాకుండా నెలల తరబడి ఉండటంపై ఆ గ్రామ కార్యదర్శితోపాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ముందు ఇక్కడి నుంచి బయటకు వెళ్లిపోండి.. అంటూ మండిపడ్డారు. మొన్నటి వరకు పంచాయతీ కార్యదర్శులకు పన్నుల వసూళ్లలో నిమగ్నం కావడంతో ఒత్తిడి చెయ్యలేదని, కానీ ఇప్పుడు కార్యదర్శులు ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ఆగ్రహించారు. గ్రామ సచివాలయాల్లోని ఫంక్షనల్ అసిస్టెంట్లును సంబంధిత గ్రామంలోని వలంటీర్లతో ట్యాగ్ చేసినప్పటికీ ప్రగతి కనిపించకపోవడం సరికాదన్నారు. వచ్చే సమావేశానికి ఆయా లే అవుట్లకు సంబంధించిన స్పెషల్ ఆఫీసర్లు హాజరు కావాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com